# మిస్సింగ్ కేస్!

'ఏమోయ్ త్రిబుల్‌ఫైవ్... రెండు రోజులుగా డ్యూటీకి రావటంలేదేం?. ఏదైనా ప్రాబ్లమా? లీవైనా పెట్టకుండా ఆబ్సెండ్ అయితే యాక్షను తీసుకోవాల్సి ఉంటుంది...' యూనిఫామ్ లేకుండా స్టేషన్‌కొచ్చిన కానిస్టేబులు వేపు గుడ్లురిమాడు ఎస్సై వేళాకోళం.

ఆయన ముందు నిలబడాలంటేనే అక్కడి స్టేషన్లో వారికి వెన్నులో వణుకు! యమధర్మరాజులా ఆరడగుల ఎత్తు... బుంగమీసం... గుంటల మొహం... పాతిక కేజీల బియ్యం బస్తా అంత పొట్ట... నల్లటి తారులాంటి వంటి ఛాయగల ఎస్సైని పగలు చూస్తే రాత్రి కళ్లోకొచ్చే రాక్షసుడిని తలపిస్తాడు. ఇక జవాబీయాలంటే డర్ర్!

గరిటె కాల్చివాత పెట్టినట్టు మాట్లాడతాడు. పాతిక కోడిగుడ్లు... రెండు నాటుకోళ్లు... ఇరవై పుల్కాలు అతగాడి దినసరి ఆహారం! ఎంత తిన్నా అర్ధగంటలో హరాయించుకో గల జీర్ణశక్తి వుంది. దేన్నీ మిక్స్ చేయకుండా ఫుల్ బాటిల్ ఏక బిగిన వుదేసే వస్తాడా ఎస్సై.

మనిషి వరిపిసినారి! ఏనాడు జేబులో చెయ్యిపెట్టి పావలా బైటికి తియ్యడు. అన్నీ ఓ.సీనే! రోజూ ఇంటికెడుతూ మామూళ్ల మూట మోసుకెళ్తాడు. లేని రోజు ఇంట్లో పెళ్లాం లాఠీ ఛార్జే! ఇంట్లో పిల్లి... బైటపులి!

ఎస్సై వేళాకోళం కింద పనిచెయ్యటమంటే వేళాకోళమేం కాదు. చేతికి చిక్కిన వాడిని వుతికి ఆరేస్తాడు. నేరగాళ్ల వద్దనుంచి రికవరీ చేసిన గోల్డు సిల్వర్... క్యాష్‌లో సగం నొక్కేస్తాడు. స్టేషన్లో ఎవరూ నోరు మెదపటానికి వీల్లేదంతే!

ల్యాండ్ సెటిల్‌మెంట్స్ చేయటంలో దిట్ట! ఆదాయం తగ్గుతుందని సర్కిల్ ప్రమోషన్ కూడా వద్దన్నాడు!

తానుమేస్తూపై వాళ్లను మేపుతూండటంతో సిటీ దాటి బైటికి ట్రాన్స్‌ఫర్ కాని అదృష్టవంతుడు వేళాకోళం. రాజకీయ పరమైన పలుకుబడికేం తక్కువ లేదు.

పైవాడేదైనా కస్సుబుస్సుమంటే కులం పేరుతో దూషించాడంటూ తనపై వారికి రిపోర్టు! అంచేత వేళాకోళం జోలికెవరూ రారు! పాతికేళ్లగా ఒకే చోట పాతుకుపోయిన వుద్దండ పిండం!

అతనితో ఎవరూ పరాచికాలాడరు. సెటైర్లు వేయరు. వేళాకోళామాడరు. వెటకారాలుకూడదు. 'లూజ్ టాక్' ఎవరైనా చేస్తే వాడేవడైనా సరే బలైపోక తప్పదు.

ఎదురుగా నిలబడ్డ కానిస్టేబుల్ త్రిబుల్ ఫైవ్‌కి (అది అతగాడి నెంబర్) నోట మాటకరువై నీళ్లు నములుతున్నాడు. భయంతో వణికి చస్తున్నాడు. గుడ్ల నీళ్లు కుక్కుకుంటున్నాడు ఏం జవాబియ్యాలో తెలీక.

త్రిబుల్‌ఫైవ్ అనబడే రామలింగం ఎవరివద్ద చేయిచాచడు. పదిపైసలు లంచంపుచ్చుకోడు. అతని శరీరంలో రక్తానికి బదులు నీతి నిజాయితీ ప్రవహిస్తూంటుంది.

మెతక స్వభావం! రామలింగం వంటి భోళామనిషి అసలు పోలీసు వుద్యోగానికి రావటమేమిటని స్టేషన్లో వారంతా ముక్కున వేలేసుకున్నారు.

ఇష్టం లేకపోయినా ఉదరపోషణార్థం... గతిలేక పోలీసు కానిస్టేబులు కాక తప్పలేదు. రామలింగం మేనమామ ఎ.సి.పి కావటాన... కాళ్లా వేళ్లా పడ్డ రామలింగం తండ్రి మాట తోసిపుచ్చలేక తన పలుకుబడితో ఎలాగో అలా ఈ వుద్యోగం ఇప్పించగలిగాడు.

ఆకతాయి వెధవకు పిల్లనివ్వటానికి ముఖం చాటేసిన వారంతా తీరా పోలీసు జాబ్ రావటంతో పిల్లను తామంటే తామిస్తామని ఇంటిముందు 'క్యూ' కట్టారు.

పోలీసు అల్లుడంటే ఎట్టాలేదన్న ఏడాదికి ఓ పదిలక్షలు వెనకేసుకోలేక పోతాడని ఆశించిన రామలింగం మామగారి ఆశని రాసే అయింది.

దేశమంతా అవినీతి కొలనులో ఈత కొడుతుంటే అల్లుడు మడికట్టుకోవటం చూచి అవక్కయ్యాడు. 'ఏం చేస్తాం కూతురుకి సుఖపడే రాత లేదు' అనుకో తప్పలేదు.

ఎవరైనా, తనను ఒరేయ్ అనిపిల్చినా బాధపడని రామలింగం తనను 'త్రిబుల్ ఫైవ్' నెంబర్‌తో పిలిస్తే విలవిల్లాడిపోతాడు. నామోషి ఫీలవుతాడు. చిర్రెత్తుకొస్తుంది. వళ్లు భగభగ మండుతుంది! అసలు తనకీ బేవార్స్ నెంబర్ డిపార్ట్‌మెంట్ ఎందుకు ఎలాట్ చేసిందో గానీ అతగాడి చావు కొచ్చింది. ఫారిన్ సిగరెట్ పాకెట్‌కున్న నెంబర్ తనది!

'సార్! ఎస్సై సార్... నన్నా నెంబర్‌తో పిలిచి హింసించకండి! నాకు

ఏడుపొస్తుంది. మీకు పుణ్యముంటుంది... చచ్చి వచ్చే జన్మలో మీ కడుపున పుడతాను... పైవాళ్లకు చెప్పి నా నెంబర్ మార్చి మరో మంచి నెంబర్ ఎలాట్ చేయించండి సార్...' వేడుకున్నాడు రామలింగం.

'నోర్మూయ్!. అంటే ఇంగ్లీషులో! 'షటప్' అన్న మాట! హిందిలో 'ఖామోష్'... అండ్రస్టాండ్! ఇదివరకు పైడి రాజని మన స్టేషన్లో వుండేవాడు.... అతని నెంబరెంతో తెలుసా 'ఫోర్ట్వన్టీ'... అంటే నాలుగొందల ఇరవై! కేడీ గాళ్ళను ఎవరైనా సరే ఫోర్ట్వన్టీ అనే పిలుస్తాను. ఆనెంబర్ ఇచ్చినందుకు పైడిరాజు బాధ పడ్డాడా? లేదే! అంతకుముందు జోసఫ్ అనే అతనకి 'త్రిబుల్ వన్' నెంబరుంది. అంటే మూడు ఒకట్లు!. నామాల స్వామికుండే పంగనామాలన్నమాట. పాపం వాడు క్రిస్టియన్ అయినా ఆనెంబర్ తనకిచ్చినందుకు బాధపడ్లేదోయ్. సంబర పడేవాడు. నెంబర్లో ఏముందోయ్ నాన్సెన్స్!... నువ్వో సెంటిమెంటల్ ఫూల్వి! అద్సరే... నేను అగి ప్రశ్నకు జవాబివ్వటం మానేసి ఏదేదో వాగుతావేంటి?

రెండు రోజులు డ్యూటీ ఎందుకు ఎగ్గొట్టినట్టు?- ఆన్సర్మై క్వశ్చన్' హేండ్స్టిక్తో బల్ల మీద బలంగా కొట్టాడు ఎస్సై.

'చెప్పాలంటే సిగ్గుగా వుంది సార్...'

'ఏమైందోయ్? నిన్నెవడైనా కిడ్నాప్ చేశాడా?...'

'అట్లా జరిగినా బాగుండేది...' వాపోయాడు రామలింగం.

'మరెందుకు రాలేదు డ్యూటీకి? చెప్పకపోతే లాకప్లో వేస్తాను...' కోపంతో మీసం మెలేశాడు.

నిజానికి ఈ వుద్యోగం చేయాలంటేనే చావుకొస్తున్నది. అన్ని రిస్క్లే! అందరికీ లోకువే... అనేసి గొణుకున్నాడు.

'అక్కడికే వస్తున్నాను సార్!' అన్నాడు పైకి.

'అక్కడికే అంటే...?-'

'అదే సార్... నేనెందుకని డ్యూటీకి రాలేదనే పాయింట్కి!.. అదీ.... మరీ... మరేమో...'

'నాన్చక పాయింట్కొచ్చెయ్. ఏడుపు ఆపి విషయం చెప్పేడు!... మీ పేరెంట్స్లో ఎవరైనా పోయారా?... నీ సిస్టర్ ప్రేమించిన వాడితో జంపైందా?...'

ఉరిమినట్టు వేళాకోళంగ మాట్లాడేడు ఎస్సై.

'వూర్కోండి సార్!... నేనంటే మీకు మరీ వేళాకోళం...'

'నన్ను పేరు పెట్టి పిలుస్తావా? నిన్ను సస్పెండ్ చేస్తాను నీవుద్యోగం హుష్‌కాకి' చేస్తాను...' లొల్లి చేశాడు.

'అయ్యో రామ. నా వుద్దేశం అది కాదు సార్... తమరు పొరపాటుగా అర్ధం చేసుకున్నారు...' రామలింగం మాటల్లో వినయం వుట్టిపడింది.

'ఏదోలే... ఏడుపు ఆపి రానందుకు కారణం చెప్పు...!

'సార్! ఆరెండు రోజులు నా జీవితంలో అత్యంత దుర్ధృష్ఠకరమైనవి సార్... ఏం జరిగిందంటే సార్... నాటోపీ... లాఠీ... కన్పించకుండా పోయాయి సార్... ఎక్కడ మిస్ అయినయ్యో గుర్తొచ్చి చావక... డ్యూటీకి రాలేక... వచ్చి మీతో తిట్లు తిన్లేక... రాలేదు సార్...'

'ఓరి యూస్ లెస్ ఫెలో! ఇంత ఘోరం జరిగితే... ఇలా మెల్లగ చెప్తావా?- ఒరేయ్ త్రిబుల్ ఫైవ్!... మినిస్టర్‌కి పవర్ పోయినా పర్లేదు. మనిషికి పరువుపోయినా పర్లేదు ఆడదాని పుస్తె తాడు ఏదొంగ రాస్కెల్ అయినా తెంపుకు పోయినా పర్లేదు. జీతం తీసుకుని ఇంటికి వెళుతున్న వాడి మనీపర్స్ దొంగ కొట్టేసినా పర్లేదు. బ్యాంకులో పదిలక్షలు డ్రా చేసుకుని స్కూటర్ డిక్కీలో పెట్టగా కేడీ వెధవలు ఎత్తుకు పోయినా పర్లేదు... కానీ.. పోలీసులకు టోపీ గుండెకాయ లాఠీ కిడ్నీ ల్లాంటివిరా! ఈ రెండూ లేకుండా మనిషిన్న వాడు జీవించటం ఎంత దుర్లభమో... లాఠీ టోపీ పోగొట్టుకుంటే సర్వస్వం పోయినట్టేరా...'

'వాటికంత ఇంపార్టెన్స్ వుందని నాకు తెలియదు సార్... తెల్సుంటే జాగ్రత్తపడే వాడిని...'

'భర్తపోతే... అదే... లేచిపోతే కాదు... చనిపోతే ఆడది ముండ మోసినట్లే... టోపీ లాఠీ పొగొట్టుకున్న పోలీసూ అంతేరా త్రిబుల్ ఫైవూ! ఉద్యోగం పోగొట్టుకుని ఓమ్మూల కూర్చోవాల్సిందే!... ఒరే... నువ్వు సర్వీసులో చేరి ఏడాదికాలేదు... నీ ప్రొబేషన్ డిక్లేర్ అవలేదు... అప్పుడే నీ ఆభరణాలు పోగొట్టుకున్నావంటే నీవెంత చవట సన్నాసివో అర్ధమౌతోంది! వాటినెక్కడైనా అవసరానికి తాకట్టు పెట్టావా ఏం ఖర్మరా రామలింగం? చెప్పి ఏడు!!

'రామ రామ! అంత మాట అవనకండి సార్...' సాష్టాంగ పడ్డాడు.

'నిలబడెహె! అవిపోయాయంటే... నీవు ప్రాణం లేని శవానివన్న మాట! నిన్ను చూస్తేంటే నా వళ్లుమండి పోతోంది. ఇహ నిన్నెవరూ కాపాడలేరు... నీ వుద్యోగం గోవిందా గోవింద!...' మాటల్లో ఎస్సై రఫ్ ఆడించేస్తున్నాడు రామలింగాన్ని.

ఎస్సై అంటే పోలీసు స్టేషన్లో ఆల్ పవర్ ఫుల్! ఫుల్ అంటే ఆ ఫుల్ అనుకునేవురోరే...'

అమ్మో... వీడమ్మ కడుపు కాలిపోను... ఇన్‌డైరెక్ట్‌గా ఫుల్ విషయం ప్రస్తావించాడూ అంటే... తనను ఓ ఫుల్ బాటిల్ ఓ.సీగా తెచ్చిమ్మని కాబోలనేసి గొణుక్కున్నాడు. జేబులో పైసాలేదు. పొద్దుటినుండి 'చాయ్' అయినా తాగలేదు తను.

ఎస్సై కాలాంతకుడు! గుడి... గుళ్లోలింగాన్ని గుటుక్కున మింగేయగలుడు.

'ఇంకేం.. వంటినవుండే యూనిఫామ్... నడుముకుండే బెల్ట్ కూడా పొగొట్టుకుని గుండు గొరిగించుకో....'

'క్షమించండి సార్... పొరపాటు జరిగిపోయింది. పుణ్యముంటుంది నాకో టోపీ... లాఠీ శాంక్షన్ చెయ్యండి సార్...' సాష్టాంగపడ్డాడు రామలింగం.

'టోపీ అంటే అల్లాటప్పాకాదు. అది స్టాక్ అయిటమ్! దాన్ని సంపాదించటం అనితర సాధ్యం! లాఠీ అంటావా మేదరి వాళ్ల దగ్గరకెళ్లి స్ట్రాంగ్‌గా వున్న పేముదుడ్డు కర్ర కొనుక్కోవచ్చునుకో... అమ్మో! నువ్వు గుండెలు తీసిన బంటువి. నీ వంటి పోలీసును నా సర్వీసులో చూడ్లేదు... సరే సరే... బోర్ కొడుతోంది గాని ఎదరు ఇరానీ హోటల్లోకెళ్లి ఒక చాయ్ పట్రా...' కుర్చీలో వెనక్కి వాలేడు.

ముష్టి 'ఛాయ్' కూడా బాదుడే! ఏం ఎస్సైరా నాయనా? అనేసి గొణుక్కుంటూ బైటపడ్డాడు రామలింగం. ఇక్కడితో ఆగడు. తర్వాత సిగరెట్ పాకెట్... నైట్‌కి ఫుల్ బాటిలు... అతగాడి గొంతెమ్మ కోరికలకు అంతుండదు. ఎదుటి వ్యక్తిని పీల్చి పిప్పి చేస్తాడు వరి జలగ! ఇంకెంత బాదతాడో ఎస్సై అని భయపడి చస్తున్నాడు.

తాను వూహించినట్టే జరిగింది! వీటన్నిటికి డబ్బులెట్లా?... ఇరానీ హోటల్ ఓనర్ని బ్రతిమాలి చాయ్ కిల్లీకొట్టు వాడిని బ్రతిమాలి సిగరెట్ పాకెట్ మటుక్కు డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పి మేనేజ్ చేశాడు. ఫుల్ అంటే మాటాలా?

అయిదారొందలుంటుంది అతగాడి బ్రాండ్!

'మూడోది నావల్ల కాదు సార్' తలొంచుకు నిలబడ్డాడు.

'కాదా?... నీవల్ల కాదా...? అయితే ఓపని చెయ్. ఓ నెల రోజులు నీ డ్యూటీ మా ఇంట్లో చెయ్! నీళ్ల తోడాలి... బట్టలు వుతకాలి... అంట్లు తోమాలి... వంట చేయాలి...'

అంటే సర్వెంట్ జాబా? ఛీ! ఇంతబ్రతకు బ్రతికి ఇంటి వెనకాల చచ్చినట్టు... చివరి ఇలాంటి ఛండాలపు పన్లు చేయమని చెప్పిన ఎస్సై మీదపడి గోళ్లతో రక్కి గొంతు పిసికి చంపేయాలన్పించింది.

ఇలాంటి పన్లు చేయటం తనవల్ల కాదు...

'ఇంకో మార్గమేదైనా చూపించండి సార్...'

'ఓపన్చెయ్! ఓపాతిక వేలు క్యాష్ పట్రా! ప్రాబ్లమ్ సాల్వ్ చేస్తా...' సిగరేట్ పొగవూదుతూ అన్నాడు వేళాకోళం. (సారీ పొగతాగుట హానికరం)

ఆ మాట విన్న రామలింగం బిక్క చచ్చిపోయాడు.

'ఏదోటి తేల్చుకో త్వరగా! పాతిక వేలివ్వటమా?- నా ఇంట్లో నెల్లాళ్లు పని చేయటమా?...'

ఈ ఎస్సై తన కొంపముంచేట్టున్నాడు. ఇవేమీ చెయ్యలేకపోతే ఆత్మహత్యే శరణ్యం. ఏడుకొండల వాడా... నేవే దిక్కు! అలనాడు మొసలి బారి నుండి రక్షించమని గజేంద్రుడు శ్రీహరిని వేడుకున్నట్టు.. తననీ ప్రాణ సంకటం నుండి ఒడ్డును పడేయమంటూ తిరుమలేశుని ప్రార్థిస్తున్నాడు మనసులో రామలింగడు. కరవమంటే కప్పకి విడవమంటే పాముకి కోపంలా వుంది అతని పరిస్థితి.

'నీ నిర్ణయం ఏమిటో చెప్పవేరా దేభ్యం? రాక్షసి లాంటి భార్య పెట్టే కష్టాలు భరిస్తూ నా ఇంట్లో చాకిరీ చేస్తావా... పాతిక వేలు క్యాష్ కొడతావా? ఏదోటి త్వరగా తేల్చుకో నేను బైటికెళ్లాల్సిన పనుంది...' తొందర చేశాడు ఎస్సై.

ఇదెక్కడి చావురా దేవుడా? ఇలా అడకత్తెరలో పెట్టి ప్రాణం తీస్తున్నాడేమిటి...?

'నువ్వు నోరు విప్పి ఓ నిర్ణయం చెప్పకపోతే... నీమీద 'మిస్సింగ్ కేసు' బుక్ చేస్తాను. ఎస్పీ దొరవారికి కంప్లైంటిస్తాను. అప్పుడు నీ వుద్యోగం వూడటం

ఖాయం!- చూడోరే!... నోటి ముందుకూడెందుకు పోగొట్టుకుంటావ్? నామాట విని మంచి నిర్ణయం తీసుకో! అన్నట్టొరేయ్ త్రిబుల్ ఫైవ్... మా ఆవిడ దగ్గర పనిచేసి మెప్పించటం అబ్రహ్మతరం కూడా కాదు గానీ... నువ్వెళ్లిసి నే చెప్పినట్టు... నీభార్య మెళ్లో నగలు తాకట్టు పెట్టయినా సరే పాతిక వేలు పట్రా... నీ ప్రాబ్లం సాల్వ్ చేసేస్తాను....' అల్టిమేటమిచ్చాడు ఎస్సై వేళాకోళం.

పెళ్ళాం మెడలో నగలెక్కడున్నయ్? తాళి తప్ప!... మామగారు 'పాపరు'! కట్నమే ఇవ్వలేపోయాడు. ఇక ఇప్పుడు పాతికవేలెక్కడ్నించి తేగలడు? డాడీని చూద్దామా అంటే... హోల్‌సేల్ షాపులో లెక్కలు రాసి తెచ్చే జీతం ఇంట్లో వాళ్ల తిండికే చాలదు. ఈ ఏడాదిగా తనకొచ్చే జీతం తోటే రెండు పూటలూ కడుపులు అందరివీ నిండుతున్నయ్.

'అలా నీళ్లు నములుత్తా నిలబడి ప్రయోజనం లేదోయ్! సరే... కేస్ బుక్ చేసి నిన్ను కస్టడీలోకి తీసుకోవటం తప్పదు... ఇదిగో రైటరూ త్రిబుల్‌ఫైవ్ దగ్గర స్టేట్‌మెంట్ తీసుకుని ఎంక్వయిరీ రిపోర్టు తయారు చేసి... ఇతగాడిని సెల్‌లో వుంచు... నే బైటికి వెడుతున్నాను..' ఛైర్లోంచి లేచి నిలబడ్డాడు ఎస్సై.

'సార్! మీరే నన్ను రక్షించి కాపాడాలి..' బావురమన్నాడు రామలింగం.

అయినా సరే వేళా కోళం పాషాణ హృదయం కరగలేదు. ఛీ అవతలకు పొమ్మని నెట్టేశాడు.

ఇంతలో....

పోలీస్ స్టేషన్ ముందు ఆగిన కార్లోంచి ఎ.సి.పి రామానుజం దిగి నేరుగా లోపలికొచ్చాడు.

పెద్ద దొరవారు ఎదుకొచ్చారబ్బా అనుకుంటూ ఎదురెళ్లి సెల్యూట్ చేశాడు ఎస్సై అతని అనుచర బృందం.

'ఏరా రామలింగం నీ కేసు ఎస్సై ఇంకా సెటిల్ చెయ్యలేదా...?-' అంటూ వచ్చి ఎస్సై రివాల్వింగ్ ఛైర్లో ఆశీనుడైనాడు ఎ.సి.పి.

ఆమాటకు వేళాకోళం తత్తరపడ్డాడు. దొరవారికి రామలింగం తెలుసా? ఎలా తెలుసు? మరి రామలింగం ఆవిషయాన్ని ఇన్నాళ్లూ ఎందుకు దాచాడు? పరిస్థితి

అర్థం కాక బుర్ర గోక్కున్నాడు ఎస్సై. త్రిబుల్ ఫైవ్ దొరవారికి కావలసినాడని ఏమాత్రం తెల్సినా విషయం ఇంతదూరం రానిచ్చేవాడు కాదే తను?

'కేసేంటి? సెటిల్ చేయటమేంటి సార్...' తొట్రపాటుతో అన్నాడు ఎస్సై, ఏమీ తెలీనట్టు.

'నాకు అంతా తెలుసు! వీడి సంగతి తెల్సు... నీ సంగతి తెల్సు!... ముందు రామలింగానికి తెలీకుండా నువ్వు కొట్టేసి దాచేసిన టోపీ లాఠీ అతనికి వాపస్ చెయ్!- ఇంత సర్వీసుండి ఇంకా సబార్డినేట్స్‌తో చైల్డిష్ గేమ్స్ ఆడటం ఎంటయ్యా?- ఐయామ్ సారీ ఫర్ యువర్ ఫూలిష్ బిహేవియర్. రామలింగం అండదండలు లేని వాడనుకుని ఇలాంటి ఛీఫ్ ట్రిక్స్ ప్లే చేస్తావా?.. ఇలా లోగడ చాలా సార్లు చేస్తే నిన్ను స్పేర్ చేశాను. అయినా నీకు బుద్ధి రాలేదు. యు ఆర్ ఎ ఫూల్ ఐసే!- రామలింగం నారిలేటివ్! ఇకనుండి అతడ్ని నువ్వే స్టేషన్లో జాగ్రత్తగా చూసుకోవాలి...

ఎ.సి.పి. మాటలన్ని వేళాకోళానికి ముచ్చెమటలు పట్టినయ్ తన ప్లానంతా బెడిసి కొట్టింది. తానే రామలింగం టోపీ... లాఠీ దాచిపెట్టి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడనే విషయం సార్‌కి ఎలా తెల్సింది?

వెంటనే బీరువా తెరిచి రామలింగానికి అతడి టోపి... లాఠీ ఇచ్చేస్తూ 'క్షమించండి సార్. రామలింగం ఎలర్ట్‌గా ఉన్నాడో లేదోని వీటిని దాచి చిన్న టెస్ట్ చేశాను. దట్సాల్...' వెకిలిగానవ్వాడు వేళాకోళం!

ఎస్సై వేళాకోళానికి చావు తప్పి కన్ను లొట్టపోయినట్టయింది.

(సమాప్తం)